

'బడిబాట'కు విద్యాశాఖ సన్నద్ధం
● 6 నుంచి 19 వరకు కార్యక్రమాలు 6

మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ
● రూ.26.9కోట్లతో అభివృద్ధి పనులు 7

మెస్ నిర్వహణ మహిళలకు అందేనా..?



- మంచిర్యాల జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే పూర్తయిన టెండర్లు
- రెండేళ్ల పాటు కాంట్రాక్టర్‌కు నిర్వహణ బాధ్యతలు
- ప్రభుత్వ ప్రకటనకు మూడు రోజుల ముందు ప్రక్రియ పూర్తి
- ప్రభుత్వ ఆదేశాలు అమలుకు నోచుకునేనా...!

మంచిర్యాల, జూన్3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెస్ నిర్వహణ మహిళా సంఘాలకే ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం మంచిర్యాల జనరల్ ఆసుపత్రిలో అమలయ్యే అవకాశాలు లేవు. రోగులకు నాసిరకం భోజనం పెడుతున్నారనే ఆరోపణతో ప్రభుత్వం ఈ నర్ణయం తీసుకుంది. మెస్ నిర్వహణ కాంట్రాక్టు గడువు పూర్తికావడంతో ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తి చేసిన అధికారులు స్థానికంగా ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. దీంతో మహిళలకే మెస్ నిర్వహణ బాధ్యతలు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి బ్రేక్ పడినట్లయింది. రోగులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా గతనెల 24న సెక్రటేరియట్‌లో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సమీక్ష సమావేశం జరిగింది. ఇందులో భాగంగా రోగులకు నాణ్యమైన భోజనం అందించాలనే నిర్ణయానికి వచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెస్ నిర్వహణ కాంట్రాక్టర్ల గడువు ముగిసినందున మహిళా సమాఖ్య సంఘాలకు ఆ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు.

మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు ఆదేశాలు..

మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెస్ నిర్వహణ బాధ్యతలు మహిళా సంఘాలకు అప్పగించాలని రాష్ట్ర మెడికల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ కార్యాలయం నుంచి గత నెల 27న ఆదేశాలు జారీ అయ్యాయి. 24వ తేదీనే వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ అధికారులు సమావేశమై మహిళ సంఘాలకు అప్పగించాలనే విషయం మీద నిర్ణయానికి వచ్చాయి. దీనిపై విధివిధానాలు రూపొందించిన తరువాత మూడు రోజులు ఆలస్యంగా మెడికల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. అయితే హైదరాబాద్‌లో ఓ వైపు సమీక్ష సమావేశం జరుగుతుండగానే మంచిర్యాలలో టెండర్లు ఓపెన్ చేశారు. మెడికల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు, మెస్ నిర్వహణ బాధ్యతలు, మహిళా సమాఖ్య సంఘాలకు అప్పగించాల్సి ఉంది. అయితే సమీక్షా సమావేశానికి ముందే టెండర్లు కాల్‌ఫర్ చేయడంతో మంచిర్యాలలో గడువు ముగిసిన మరునాడు టెండర్లు ఓపెన్‌చేయక తప్పని పరిస్థితి నెలకొంది. ఇందులో తక్కువ కోట్ చేసిన ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా అధికారులు ఆ ప్రకారమే కొత్త కాంట్రాక్టర్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో ఈ నెల 5 నుంచి కొత్త కాంట్రాక్టింగ్ ఏజెన్సీ రోగులకు భోజనం అందించనుంది. ఆసుపత్రిలో 330 మంది రోగులకు ఆహారం... (తరువాయి 7లో)

సమీక్ష రోజే ముగిసిన టెండర్లు...

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండేళ్లుగా కొనసాగుతున్న మెస్ నిర్వహణ కాంట్రాక్టర్ గడువు ముగియడంతో తప్పని సరి పరిస్థితుల్లో అధికారులు టెండర్లను ఆహ్వానించారు. గత నెల 16న టెండర్లకు ఆహ్వానం పలుకగా 23న టెండర్లు దాఖలుకు తుది గడువు ముగిసింది. దీంతో మరునాడు ఉదయం 11 గంటలకు టెండర్లు ఓపెన్‌చేశారు. శ్రీకృష్ణ కన్‌స్ట్రక్షన్స్ ఏ జెన్సీకి మెస్ నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. ఈనెల 5వ తేదీ నుంచి రోగులకు కాంట్రాక్టు ఏజెన్సీ భోజనం సరఫరా చేయనుంది.

భూభారతికి విశేష స్పందన


భూభారతిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం,జూన్3(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భూభారతికి విశేష స్పందన లభించింది. మంగళవారం నిర్వహించిన రెవెన్యూసదస్సులో భాగంగా పాత మంచిర్యాల, రంగపేట, ఆండాలమ్మ కాలనీ రైతులు సదస్సులో భూ సమస్యలను అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన, రెవెన్యూ అధికారులతో పాటు మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, సింగిల్ విండో డైరెక్టర్ తూముల వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన రిలే దీక్ష

నస్పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : తీగల్‌పహాడ్ గోదాముల వద్ద న్యాయమైన సమస్యల పరిష్కారానికి కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులు చేపట్టిన నిరహార దీక్ష మంగళ వారం నాటికి రెండో రోజులు చేరింది. సీసీఐ అధికారులు తమ సమస్యల పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నారని, ఫలితంగా తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని యజమానులు తెలిపారు. ఇతర రాష్ట్రాలకు చెందిన లారీలు తక్కువ అద్దెలకు పిలిపించి లోడింగ్ ప్రక్రియను చేస్తున్నారని ఆరోపించారు. రెండవ రోజు దీక్షలో కోల్‌బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుండా సురేశ్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ బాస్కర్ల సుమన్, ప్రధాన కార్యదర్శి రాందేని రమేశ్, జాయింట్ సెక్రటరీ అరికోల్ల రమేశ్, కల్చరర్ సెక్రటరీ గుడికందుల తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి పవన్, కోశాధికారి కటకం ప్రశాంత్‌లతో పాటు పలువురు లారీ యజమానులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు


ఉత్సవ మూర్తుల ఊరేగింపు

హాజీపూర్,జూన్3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నంనూర్ పునరావాస కాలనీలో నూతనంగా నిర్మించిన భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు మంగళవారం మొదలయ్యాయి. విగ్రహాలను ఊరేగింపుతో ఆలయ మండపానికి తీసుకొచ్చారు. అభయాంజనేయ, భక్తాంజనేయ, శివపంచాయతీల, నాగేంద్ర, నవగ్రహ, ధ్వజశిఖర ప్రతిష్ఠాపన మహోత్సవంలో మొదటిరోజు గుడిప్రధాన దాత అయిన ఆన్కార్ పద్మశ్రీ సత్యనారాయణ దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అచ్చులాపూర్ వేదపాఠశాలకు చెందిన ముద్దు దీరజ్ అవధాని ఆధ్వర్యంలో పది మంది వేదపండితులు పూజలో పాల్గొన్నారు. గ్రామస్థులు విగ్రహాల జలాధివాసంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బేర పోచయ్య, ఒడ్డె శ్రీనివాస్, ఒడ్డె బాలరాజు, పెద్దపల్లి స్వామి, కారుకూరి తిరుపతి, ఒడ్డె రాజమౌళి, తిరుపతి, ఆకిరెడ్డి వెంకటేశ్, గోపులింగయ్య, రాసమల్ల శ్రీనివాస్ గౌడ్‌లు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సంరక్షణ కోసమే జల్‌సంచాయ్-జల్‌భగీరథి

● జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జల సంవత్సరం కార్యక్రమాన్ని ప్రాధాన్యతగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జల సంచాయ్-జల్ భగీరథి కార్యక్రమం నిర్వహిస్తోందని జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో జల సంరక్షణ జాతీయ ప్రాధాన్యతగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. వర్షపు నీటి సంరక్షణగా నిర్మాణాలు, నీటినిర్వహణలో సమాజపాత్ర ముఖ్యమన్నారు. ప్రజలంతా స్వచ్ఛందగా నీటిని పొదుపు చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నీటివనరుల విలువ, సురక్షిత త్రాగునీటి వినియోగం ద్వారా వ్యాధులను వ్యాప్తిని అరికట్టడంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి వనరుల రక్షణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకొని నీటిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధి కారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

వ్యాధుల నివారణ కోసం ముందస్తు చర్యలు తీసుకోవాలి

వర్షాకాలం సమీపిస్తున్నందున జిల్లాలో కీటకజనిత వ్యాధులు ప్రబలకుండ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో కలిసి గూగుల్‌మీట్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సిబ్బంది విధులపట్ల సమయ పాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని అన్నారు. జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేకజ్వరం వార్డులు ఏర్పాటు చేయాలన్నారు. అవుట్‌డేటెడ్ మందులను వాడకూడదన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీలు ప్రజలకు తెలిపే విధంగా డప్పు చాటింపు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డీహెచ్‌వో హరీశ్‌రాజ్, పంచాయతీరాజ్ మున్సిపల్ సంక్షేమం వెనుకబడిన తరగతి అభివృద్ధి, షెడ్యూల్డ కులముల అభివృద్ధి, డీఆర్ డీఏ, విద్య, వైద్య, శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు

● ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం అందిస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం చెన్నూరులోని క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు లేని వారికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో మోహన్, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.


చెన్నూరులో బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

బోర్‌వెల్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే

చెన్నూరు మున్సిపాలిటీలోని 6,12 వార్డుల్లో తాగునీటి సమస్యను తీర్చేందుకు ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్‌లను మంగళవారం ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నీటి సమస్య లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి తాగు నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్నజిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ చౌదరి

మంచిర్యాలక్రైం, జూన్3 (ఆంధ్రజ్యోతి): బాలికల సంరక్షణలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కె. చౌదరి అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ మంచిర్యాల ప్రజ్వల స్వచ్ఛంద హైదరాబాద్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేజీబీవీ, మోడల్ స్కూల్, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల, టీఎస్ఆర్ఐఎస్ ఉపాధ్యా యులకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్తును నిర్ణయించే స్థాయికి ఆడపిల్లలు ఎదగాలని అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలో చదువుతో పాటు మానవతావిలువలు కూడా నేర్పించాలని మైనర్లకు వ్యక్తిగత శుభ్రత, శరీరపెరుగుదల మార్పులు దాని పర్యావసానాల గురించి వివరించాలన్నారు. తరుచు పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కండక్ట్ చేస్తూ పర్సనల్ విషయాలు చర్చించాలని బాల్య వివాహాలను నిరోధించాలని, లైంగిక దాడి బాధితులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జీసీ యశోధర, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, ప్రజ్వల, సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ మహ్మద్ సిరాజ్, అసిస్టెంట్ కోఆర్డినే టర్ అనిల్ పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్


వైద్యశిబిరంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్

మంచిర్యాలక్రైం,జూన్3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించే ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి హరీశ్ రాజ్ అన్నారు. పాతమంచిర్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వందరోజుల పాటు ఇంటిగ్రేటెడ్ వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. జాతీయ క్షయ నివారణ, హెచ్ఐవీ ఎయిడ్స్ అసంక్రమణ వ్యాధులు, హెపటైటిస్ బీసీ వాటిపైన ప్రజల్లో పరీక్షలు చేయడం, అవగాహన కలిగిస్తామన్నారు. వారంలో నాలుగు రోజుల పాటు నెలకు 16 రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆయా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఆశ, ఆరోగ్య కార్యకర్తలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. 102 సిబ్బంది వాహనాలను ఆర్‌బీఎస్‌కే సిబ్బంది వారి సేవలను ఐసీటీసీ సేవలను ఎక్స్‌రే చేయడానికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి టెక్నిషియన్ల సేవలను సమన్వయంతో చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నరేశ్, డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శివప్రతాప్, డాక్టర్ అమర్, డాక్టర్ రాము, డాక్టర్ రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న యోగా సభ్యులు

మందమర్రి టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆయుష్ విభాగం డా. నీరజ ఆధ్వర్యంలో యోగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ రహదారి కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విటమిన్లతో కూడిన ఆరోగ్యకరమైన భోజనం తీసుకోవాలన్నారు. విస్తరిస్తున్న వ్యాధుల దృష్ట్యా ప్రతి రోజు యోగా చేయడం మంచిదని ప్రముఖ యోగా శిశ్యులు, యోగా అవార్డు గ్రహిత కొంపెల్లి రమేష్ అన్నారు. సింగరేణి పాఠశాలలో ఉచిత యోగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకురాలు శైలజ, రాంమోహన్, సభ్యులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్‌లో రెవెన్యూ గ్రామసభలు



నస్పూర్ తహసీల్దార్ సంతోష్ కు అర్జీని అందజేస్తున్న రైతు

నస్పూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సు గ్రామ సభలు నస్పూర్ పట్టణంలోని తీగల్ పహాడ్, తాళ్లపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి రైతులు వివిధ సమస్యలపై మూడు అర్జీలను సమర్పించారు. తీగల్ పహాడ్‌లో రెండు, తాళ్లపల్లిలో ఒక ధరఖాస్తులు వచ్చాయి. తహసీల్దార్ సంతోష్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ హరిత, ఆర్ఐలు ప్రశాంత్, చందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

కాసిపేట, జూన్3(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు నాణ్య మైన విత్తనాలను ఎంపిక చేసుకోవడమే కీలకమైందని నాణ్యమైన విత్తనం రైతు నేస్తం ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ముత్యంపల్లి రైతుల వేదికలో ఏర్పాటు చేసిన రైతుల విత్తన ఎంపిక అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకొని లాభసాటి వ్యవసాయాన్ని కొనసాగించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి సిహెచ్ ప్రభాకర్, ఏఈవోలు శ్రీధర్, ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

భీమిని: ప్రతీగ్రామంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను అందజేస్తామని వ్యవసాయ శాఖ అధికారి యమునాదుర్గ అన్నారు. మంగళవా రం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం అనే కార్యక్రమంలో భాగంగా విత్త నాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతులు ఎస్‌కే సలీమ్, కామెర విఠల్, ఆకిరెడ్డి మల్లేష్, ఏఈఓలు వినోద్ కుమార్, కార్తీక్, అఫ్రోజ్ లు పాల్గొన్నారు.

దండేపల్లి: నాణ్యమైన విత్తనాల ద్వారా పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటి ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ, మండల వ్యవసాయ శాఖ అధికారి గొర్ల అంజిత్‌కుమార్‌లు అన్నారు. నాణ్యమైన విత్తనం, రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ద్వారక రైతు వేదికలో మం గళవారం విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు మౌనిక, సృజన్య, అర్చన. శ్రీకన్య, అఖిల్, నరేష్, మండల రైతులు పాల్గొన్నారు.


కాసిపేటలో విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారులు

హాజీపూర్: నాణ్యమైన విత్తనం రైతు నేస్తము అనే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు విత్తనాలను హాజీపూర్ మండల కేంద్రంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పయ్యావుల పద్మముని, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, ఏడీఏ అనిత, శాస్త్రవేత్త సాయినాథ్, పుస్కూరి శ్రీనివాస రావు, మండల వ్యవసాయాధికారి క్రిష్ణలు పాల్గొన్నారు.

వేమనపల్లి : వేమనపల్లి రైతు వేదికలో మంగళవారం వ్యవ సాయ శాఖ అధికారులు విత్తనోత్పత్తి విత్తనాలను రైతులకు అందజేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తయారైన ఈ విత్తనాలను రైతులకు వ్యవసాయశాస్త్రవేత్త నాగరాజు, వ్యవసాయాధికారి వీరన్నలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రుక్సర్ సుల్తానా, హెప్సిబా, మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్, మాజీ ఎంపీపీ వెంకటేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాబీర్ అలీ పాల్గొన్నారు.

కోటపల్లి : ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనం అనే కార్య క్రమాన్ని ప్రారంభించారు. జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ స్రవంతి, బెల్లంపల్లి ఉద్యానవనవన శాస్త్రవేత్త కృష్ణలు పాల్గొని పలు సూచనలు చేశారు. అనంతరం రైతులకు పది కిలోల వరి విత్తన బ్యాగు, 3 కిలోల పెసర విత్తనాలను అందించారు. మండల వ్యవసాయాధికారి సాయికృష్ణ, ఏఈవోలు రాజ్‌కుమార్, వెంకటేష్, వైష్ణవి, అనూష , రైతులు పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని కొత్తపల్లి రైతు వేదికలో మంగళవా రం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, వ్యవసాయాధికారి సుష్మ, ఏఈవోలు శంకర్, ధనలక్ష్మి, వసుధ, నాయకులు శంకర్, బానయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)



'బడిబాట'కు విద్యాశాఖ సన్నద్ధం

● 6 నుంచి 19 వరకు కార్యక్రమాలు ● ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపే లక్ష్యం

వాంకిడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): చదువుకు దూరమైన పిల్లలను బడుల్లో చేర్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెంచేందుకు విద్యా శాఖ సన్నద్ధమవుతోంది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ పాఠశాలలతో ప్రభుత్వ విద్యావ్యవస్థ ప్రమాదంలో పడింది. ఈ క్రమంలో సర్కారు పాఠశాలలను కాపాడుకోవడం విద్యాశాఖకు కత్తిమీదసాములా మారింది. అందుకని పాఠశాలల్లో విద్యార్థులను ఆకర్షించడంకోసం ప్రభుత్వం ఏటా విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా ఈ ఏడాది జూన్ 6నుంచి 19వరకు రోజుకో కార్యక్రమంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులను కలవనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీ, తదితర సౌకర్యాలను వివరిస్తూ పిల్లలను పాఠశాలల్లో చేర్పాలని అవగాహన కల్పించనున్నారు. ఉపాధ్యాయులు ప్రతిగ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మధ్యలో చదువు మానేసిన వారిని, బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయనున్నారు. దీంతో పాటు అయిదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీకేంద్రాల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలసంఖ్య పెంచలాన్నలక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా ఐదురోజుల పాటు ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ తరగతులను సైతం ప్రభుత్వం నిర్వహించింది.

● కొన్నేళ్లుగా చేపడుతున్నా..

గత కొన్నేళ్లుగా విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం చేపడుతున్నా సత్ఫలితాలు రావడంలేదు. ప్రస్తుతం ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సమన్వయంతో పాఠశాలలను బలోపేతంచేయడం, మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పిస్తున్నారు. విద్యార్థులు చేరి వీటిని సద్వినియోగం చేసుకునేలా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం ద్వారా ప్రచారం కల్పించనున్నారు.

బడి బయట ఉన్న పిల్లలు..

బడిబాటలో భాగంగా బాల కార్మికులు, బడి బయట పిల్లలు, అనాథలు, అంగన్‌వాడీ చిన్నారులను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే కార్యక్రమాలు చేపట్టను న్నారు. కేంద్రాల నుంచి చిన్నారులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా అవగాహన కల్పించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు మార్పు జరిగేటప్పుడు ప్రైవేటుకు వెళ్ల కుండా చూసుకోవడం, గతంలో డ్రాప్ అవుట్ అయిన వారిని తిరిగి తెచ్చు కోవడం, ఆదర్శ పాఠశాలల ఏర్పాటుతో వాటిపై ప్రత్యేక చర్యలు చేపట్టడం, తదితర వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

● కార్యక్రమాల్లో భాగంగా జూన్ 6న గ్రామ సభలు నిర్వహించాలి. 7న ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను గుర్తించాలి. 8నుంచి 10వరకు కర పత్రాలతో ఇంటింటా ప్రచారం చేపట్టాలి. డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలి. ప్రత్యేక అవసరాలు గలపిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి.

● 6నుంచి 10వ తేదీవరకు నిర్వహించిన కార్యక్ర మాలపై 11న సమీక్షించుకోవాలి. 12న అమ్మఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజాప్రతి నిధులతో ప్రారంభించుకోవాలి. అదే రోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయాలి.

● 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ నిర్వహించాలి. 16న ఫౌండేషనల్ లిటరీస్అండ్ న్యూమ రసీ(ఎఫ్ఎల్ఎన్) లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ఎల్ఐపీ దినోత్సవం జరుపుకోవాలి. 17నవిలీన విద్య, బాలిక విద్యాదినోత్సవం నిర్వహించాలి. 18న తరగతి గదుల డిజిటలీకరణపై అవగాహన కల్పించాలి. మొక్కల పెంపకం ప్రాధాన్యన్ని విద్యార్థులకు అవగాహన కల్పించాలి. 19నబడిబాట కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించాలి.

పకడ్బందీగా నిర్వహిస్తాం..



బడిబాట కార్యక్రమం ఈ నెల 6 నుంచి పకడ్బం దీగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాం. ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులు వెళ్లి బడి మానేసిన, బాల కార్మికులను గుర్తించి తిరిగి వారిని పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటారు. పాఠశాలల్లోని సౌకర్యాలు, విద్యావిధానంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ఈ నెల 19 వరకు చేపట్టా ల్సిన బడిబాట కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేసేలా అన్ని విధాల కృషి చేస్తున్నాం.

- శివచరణ్‌కుమార్, ఎంఈవో

యోగాతో ఆరోగ్యం

కౌటాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవ్చని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫ్రీ యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడుతూ యోగా చేయడం వల్ల ఆరోగ్యాన్ని సాధించవచ్చన్నారు. ఉచితంగా యోగా తరగతులు నిర్వహిస్తున్న జన ప్రభుత్వ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జాడి చంద్రశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఐ రమేశ్, ఎంపీడీవో రమేశ్, ట్రస్ట్ చైర్మన్ వరలక్ష్మి, అధ్యక్షుడు సురేష్, పతాంజలి జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

ఆసిఫాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆసియా కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సిర్పూర్(యూ) మండలానికి చెందిన గేడెం సుహాసిని అనే విద్యార్థినిని మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి సన్మానించారు. ఇటీవల పశ్చిమబెంగాల్‌లో నిర్వహించిన ఆసియా కప్ పోటీల్లో సుహాసిని బంగారు పతకం సాధించడం గర్వకారణమని ఎమ్మెల్యే కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సాధించాలని సూచించారు.

బడిబాట పకడ్బందీగా నిర్వహించాలి

ఆసిఫాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్యతో కలిసి విద్యాశాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, కార్మిక, మహిళా శిశు సంక్షేమ, వెనకబడిన తరగతుల సంక్షేమం, మైనార్టీ, గిరిజన సంక్షేమ, షెడ్యూల్‌కులాల సంక్షేమ శాఖాధికారులతో బడిబాట కార్యక్రమం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జిల్లాలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని తెలపారు. అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీలలో బడి బాట కార్యక్రమం ద్వారా చేపట్టబోయే కార్యక్రమాలపై గ్రామస భలు నిర్వహించాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలు, ఐదేళ్ల నిండిన వారు పాఠశాలలో చేర్పించే విధంగా కార్యాచరణ చేపట్టాలన్నారు. పరిశ్రమలు, ఇటుక బట్టీలు, హోటళ్లలో పని చేసే బాల కార్మికులను గుర్తించాలన్నారు. ముఖ్యంగా బాలికలు పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో బడిబాట కార్యక్రమం విజయవంతం అయ్యే విధంగా అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని తెలిపారు. మండల స్థాయిలో తహసీల్దార్‌లు ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఐకేపీ ఏపీఎం, ఉపాధి హామీ ఏపీవోలు, ఎస్సైలతో కూడిన మండల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. వారికి కొన్ని పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత అప్పగించాలని తెలిపారు. కార్యదర్శులు, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో ఉండే ప్రజాప్రతినిధులు, కుల పెద్దలు, స్వయం సహాయక సంఘా లు, స్వచ్ఛంద సంస్థలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అనంతరం మాస్టర్ మైండ్స్ ద్వారా నిర్వహించే ఆన్‌లైన్ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో జడ్పీసీఈవో లక్ష్మీనారా యణ, ఆయా శాఖల అధికారులు సజీవన్, నదీం, ఉమర్ హుస్సేన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మంగళ వారం విద్యార్థుల సౌకర్యార్థం శుద్ధ జల ప్లాంట్‌ను కలెక్టర్ వెంకటేష్ దోత్రే ప్రారం భించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శుద్ధ జలాన్ని అందిం చడానికి ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇటీవల పొరుగు సేవల పద్ధతిలో ఎంపికైన వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. వైద్య విద్యార్థులతో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ప్రిన్సిపాల్ లక్ష్మి, డీఎంహెచ్‌వో సీతారాం పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దహెగాం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రం లోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. గ్రామాల్లో ఇళ్ల చుట్టు వర్షం నీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ శాఖ ల సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ సమస్యను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసు కురావాలని సూచించారు. అధిక వర్షాలు, వరదలు సంభవించినప్పు డు ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెండరీ పాఠశాలలో అన్ని శాఖలతో తాగనీరు సరఫరా, పారిశుధ్యం, వర్షాలు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు. మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో ఆల్బర్ట్, సూపర్‌వైజర్ హసీనా, మెడికల్ ఆఫీర్ ఆర్సీన్ తదితరులు పాల్గొన్నారు.

నగల కోసమే మహిళ హత్య

వివరాలు వెల్లడించిన డీసీపీ భాస్కర్



మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి నగల కోసం ఓ మహిళను గొంతు నులిమి దారుణంగా హత్య చేసిన నిందితులు మండలి నరేశ్, అలివేలును పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను డీసీపీ భాస్కర్ మంగళవారం మంచిర్యాలలో వెల్లడించారు. మంచిర్యాల పట్టణం మేదరివాడకు పూస లక్ష్మీ ఒంటరిగా ఉంటోంది. వెల్గటూర్ మండలం కంభంపల్లికి చెందిన నరేశ్ గతంలో మంచిర్యాలలోని కాలేజీ రోడ్డులో నివాసం ఉండేవాడు. బార్బర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేశ్‌కు పూసలక్ష్మీతో పరిచయం ఉండేది. నరేశ్ జల్సాలకు అలవాటు పడి అప్పుల పాలయ్యాడు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌కు చెందిన అలివేలు ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహించేది. నరేష్‌కు అలివేలుకు పరిచయం ఏర్పడి కొంతకాలంగా సహజీవనం సాగిస్తున్నారు. వీరిద్దరి ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో నరేశ్ మంచిర్యాలలో ఉంటున్న పూస లక్ష్మీని హత్య చేసి నగదు, నగలను దొంగలిద్దామని అలివేలుతో చెప్పాడు. దీంతో 2024, నవంబర్ 26న హత్య చేయడానికి ప్రయత్నించగా ఫలించలేదు. మరుసటి రోజు సాయంత్రం మృతురాలి ఇంటికి వెళ్లి గొంతునులిమి హత్యకు పాల్పడ్డారు. ఆమెపైన ఉన్న ఒకటిన్నర తులాల గొట్టాల కుతికట్టు, అరతులం చేయి కమ్మలు, 20తులాల పట్టి గొలుసులు, రెండున్నర తులాల నల్లపూసల తాడుతో పాటు మృతిరాలి సెల్‌ఫోన్‌ను దొంగలించి ఏమి తెలియనట్టే ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. హత్య జరిగిన రెండు రోజులకు మృతురాలి అక్క దీనవేని లక్ష్మీ ఫోన్ చేయగా స్పందించక పోవడంతో లక్ష్మీతో పాటు ఆమె బంధువులు ఇంటికి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. అనుమానం రావడంతో తాళం పగులకొట్టి చూడగా కుల్లిపోయిన శవంతో కనిపించింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు కొనసాగించారు. దర్యాప్తు కొనసాగించే క్రమంలో మంగళవారం నరేశ్, అలివేలు అనుమానాస్పద స్థితిలో పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చోరీకి పాల్పడిన నగలతో మంచిర్యాలకు వచ్చారని దర్యాప్తులో తేలింది. వారి వద్ద నుంచి గొట్టాల కుతికట్టు, చెవికమ్మలు, వెండి పట్టీలు, పట్ట గొలుసులు, మొబైల్‌ఫోన్‌ను రికవరీ చేశారు. రెండున్నర తులాల నల్ల పూసల దండను రికవరి చేయాల్సి ఉంది. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ పేర్కొన్నారు.

కేసును ఛేదించిన వారికి రివార్డు

చోరీ, హత్య కేసును ఛేదించిన మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్, ఎస్ఐ తిరుపతితో పాటు సీసీఎస్ ఎస్ఐ మధుసూదన్, సిబ్బంది మహేశ్‌బాబు, తిరుపతి, రమేశ్, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి, ఉపేందర్, జాఫర్, సురేశ్, రాము, ఇర్షాద్, శ్రీనివాస్, సీసీఎస్ సతీష్‌లను డీసీపీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తాండూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి పెగడపల్లి సమీపంలోని పత్తి జిన్నింగు మిల్లు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో భూక్య సురేష్ (27) అనే ట్రాక్టర్ డ్రైవర్ అక్కడిక్కడే మృతిచెందినట్లు తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి నుంచి ఆసిఫాబాద్‌కు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ సురేష్ అక్కడిక్కడే మృతిచెందగా అతని పక్కనే ఉన్న రాజు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. రాజును 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన సురేష్ సోమగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి. సురేష్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. రోడ్డు ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా లారీని, ట్రాక్టర్‌ను రహదారి నుంచి పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేసినట్లు తెలిపారు.

పేకాటస్థావరాలపై దాడులు

చింతలమానేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. గూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని, నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారని ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపారు. వారి నుంచి రూ. 2,140 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



ఎకరానికి రూ. 60 లక్షలు పరిహారం చెల్లించాలి




కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

రెబ్బెన, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గోలేటి ఓపెన్‌కాస్టులో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి 60లక్షల రూపాయల పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మంగళవారం కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్టు పేరుతో భూమి తీసుకుంటున్నదని చెప్పారు. అక్కడ భూములకు చాలా డిమాండ్ ఉందని చెప్పారు. రైతులకు ఎకరానికి రూ.7.56లక్షలు ఇస్తున్నారని చెప్పారు. యాజమాన్యం ఇంత తక్కువ ప్రకటించడం దారుణమని అన్నారు. ఈ డబ్బులతో తమకు బయట ఎక్కడా భూములు లభించే అవకాశం లేదన్నారు. తమకు వెంటనే న్యాయం చేసి కనీసం ఎకరాకు రూ.60లక్షలు పరిహారం ఇప్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాంకు కూడా వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్, సోనాపూర్ గ్రామపటేల్ దొందెరావు, సిడాం తిరుపతి, అరిగెల మధుకర్ గౌడ్, భగవంతరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన గనుల ఏర్పాటుకు చర్యలు

శ్రీరాంపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నూతన గనుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ అన్నారు. మంగళవారం ఆయన కొత్తగూడెం ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. ప్రస్తుత గనుల పరిస్థితిని తెలుసుకొని భవిష్యత్తులో చేపట్టబోయే నూతన గనుల ఏర్పాటుపై కార్యాచరణ రూపొందించాలన్నారు. లేనిపక్షంలో ఇల్లందు, మణుగూరు, బెల్లంపల్లి, తదితర ఏరియాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఉత్పత్తిలో కీలక భూమిక పోషించే ఓవర్‌బర్డెన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాంట్రాక్టర్లతో మాట్లాడి ఓబీ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు రవాణాపై ఆలోచన చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తిలో నష్టాల నివారణ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. శాంతిఖని, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ల్లో నష్టం రాకుండా చూసుకోవాలన్నారు. యంత్రాలతో పనిగంటలు పెంచి ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఉద్యోగుల గైర్హాజరును గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. బొగ్గు నాణ్యత పెంపుదలలో భాగంగా సత్తుపల్లి వద్ద కోల్ వాషరీ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఉద్యోగులు ఐక్యంగా లక్ష్యాలు సాధించాలని సూచించారు. సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ, కె వెంకటేశ్వర్లు, ఈడీ(కోల్ మూమెంట్) సుభానీ, జీఎం(సీపీపీ) మనోహర్, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎండీ బలరామ్

రక్షణ సూత్రాలు పాటించాలి

మందమర్రి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రక్షణ సూత్రాలు పాటించాలని బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ అన్నారు. ఏరియాలోని కేకే ఓసీపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రమాద రహిత ఉత్పత్తే ప్రధాన లక్ష్యమన్నారు. అధికారులు, ఉద్యోగులు అనే తేడా లేకుండా అందరు రక్షణ సూత్రాలను పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా పని చేస్తే ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ప్రమాదాలను అరికట్టేందుకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. గనుల్లో పని చేసే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉం డాలని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా రక్షణాధికారి రవిందర్, మేనేజర్ రామరాజు, ప్రాజెక్టు ఇంజనీర్ వెంకటరమణ, వంశీధర్, పిట్ కార్యదర్శి కుమార స్వామి, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్

సమస్యలు పరిష్కరిస్తాం

జైపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్‌రావు అన్నారు. ఐకే1ఏ , ఐకే ఓపెన్‌కాస్టులో మంగళవారం కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భీంరావు, తిరుపతి రాజు, రవీందర్‌రెడ్డి, జీవన్‌జోయెల్ తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కార్మికుల డిమాండ్ల సాధనకు మహా ధర్నా

మందమర్రి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సులభ్ కాంప్లెక్సుల వద్ద పని చేస్తున్న కార్మికుల డిమాండ్ల సాధనకు కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ఎదుట గురువారం ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నామని ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి డివిజన్ అధ్య క్షుడు ఎండీ జాఫర్ అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత కొన్ని నెలలుగా సులభ్ కార్మికులకు వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్లు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. దుర్గంధం దిగమింగుకుంటూ ప్రజారోగ్యం కోసం పాటు పడుతున్న వారికి సకాలంలో వేతనాలు చెల్లించకుంటే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికే జీఎం కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహించినా పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో మహేశ్వరి, కనకయ్య, పాల్గొన్నారు.

ఫొటో తొలగించడం సరికాదు

జన్నారం, జూన్3 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను రాత్రి కిరాత్రే తొలగించడాన్ని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కమ్మల విజయధర్మ ఖండించారు. రాష్ట్రంలో దిగజారుడు రాజకీయాలు కొనసాగుతున్నాయని ఇలాంటివి మానుకోవాలని హితవుపలికారు. పుట్టిన రోజు సందర్భంగా హరీష్‌రావు అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడం సరికాదన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జన్నారం, జూన్3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొన్కల్ గ్రామంలో గల గాంధీనగర్‌కు చెందిన గల్ఫ్‌కార్మికుడు గుండారపు రాజేశ్ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు ఉద్యమ నాయకుల సహకారంతో ఎరుకల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో రూ. 10వేల ఆర్థిక సాయాన్ని సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ బాధిత సంఘం సభ్యులు దుమ్మల్ల ఎల్లయ్య, మరిపెల్లి అంజయ్య, శేఖర్, శేఖర్ సభ్యులు పాల్గొన్నారు.

జన్నారం ఎస్ఐగా అనూష

జన్నారం, జూన్3 (ఆంధ్రజ్యోతి): జన్నారం ఎస్ఐగా అనూష ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జన్నారం ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి. రాజవర్ధన్ వీఆర్‌కు బదిలీకాగా రామగుండంలో విధులు నిర్వహిస్తున్న అనూషను జన్నారం ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



హిందువులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం,జూన్3(ఆంధ్రజ్యోతి): గోవుల అక్రమరవాణను అడ్డుకున్న హిందువులపై దాడి చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హిందు సంఘాల ఐక్యవేదిక కార్యదర్శి కర్నకంటి రవీందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో కొందరు ముస్లిం మూకలు గోవులను అక్రమ రవాణ చేస్తున్నారని సమాచారం మేరకు మెదక్ విభాగ్ కార్యదర్శి రాజారాంతో పాటు హిందు బంధువులను ముస్లింలు దాడి చేయడాన్ని ఖండించారు. వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కోటేశ్వర్, బైరి విష్ణు దాసు, రమేశ్ యాదవ్ ఉన్నారు.

మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు
- రూ.26.9కోట్లతో అభివృద్ధి పనులు



మంచిర్యాల రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులు

మంచిర్యాలకలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల రైల్వేస్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకోసం అధునాతన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. అమృత్‌భారత్ స్కీం ద్వారా ప్రత్యేకంగా అభివృద్ధి చేసేందుకు మంచిర్యాల స్టేషన్‌ను చేసింది. ఇప్పటికే పనులు ప్రారంభం కాగా త్వరలోనే పనులు పూర్తయి ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. రైల్వేశాఖ అమృత్‌భారత్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ పథకం ద్వారా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో 21రైల్వే స్టేషన్‌లు ఎంపికయ్యాయి. అందులో మంచిర్యాల రైల్వేస్టేషన్ ఉండడం గమనార్హం.

అధునాతన సౌకర్యాలు ...

మంచిర్యాల రైల్వే స్టేషన్ సామర్థ్యాలను పెంచడం ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు కల్పించడం కోసం అమృత్‌భారత్ స్టేషన్ల ఆధునీకరణ పనులు త్వరి తగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించేందుకు అధికారులు ప్రణాళికసిద్ధం చేశారు. మోర్డనైజేషన్‌లో భాగంగా స్టేషన్‌లోపల పరిసరాల్లో పరిశుభ్రత పాటించడం స్టేషన్ ఆవరణలో మొక్కలు పెంచడం ప్రయాణికులకు ఆధునాతనమైన వెయిటింగ్‌హాల్‌లు అందుబాటులోకి రానున్నాయి.

శరవేగంగా అభివృద్ధి పనులు..

రూ.26.9 కోట్లను మంచిర్యాల రైల్వేస్టేషన్ ఆధునీకీకరణకు నిధులు మంజూరు చేసింది. అందులో మూడో ప్లాట్‌ఫారం వద్ద గూడ్స్ షెడ్డు, హమాలీలకు రెస్ట్ రూం, బెల్లంపల్లి రూట్‌లో మంచిర్యాల స్టేషన్‌కు 50 మీటర్ల దూరంలో అధునాతన ఎస్కలేటర్ ఏర్పాటు చేయనున్నారు. మొదటి ప్లాట్‌ఫారంలో స్త్రీలకు, పురుషులకు వేర్వేరుగా వెయిటింగ్‌హాళ్లు అందుబాటు లోకి రానున్నాయి. ఉచిత వైఫై, లిఫ్టులు, ఎస్కలేటర్లతో టాయిలెట్లు సకలసదుపాయాలతో పాటు వన్‌స్టేషన్- 1 ప్రొడక్స్ దుకాణాలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, స్టేషన్‌కు ముందు వెనుకభాగంలో గార్డెన్స్ ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతల్లో మంచిర్యాల స్టేషన్‌కు ఎంపిక చేయడంపట్ల ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల నుంచి ఉత్తర దక్షిణ ప్రాంతాలకు రైల్వే కనెక్టివిటీ ఉంది. రవాణాకు కూడ ఆ స్థాయిలో ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.



రైల్వే స్టేషన్ ఆవరణలో హమాలీల కోసం ఏర్పాటు చేస్తున్న షెడ్డు

పెరుగుతున్న ప్రయాణికుల రద్దీ..

మంచిర్యాల రైల్వే స్టేషన్ కేంద్రంగా చుట్టు పక్కల స్టేషన్ల కేంద్రంగా అనేక రవాణ సదుపాయాలు ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. చుట్టు పక్కల స్టేషన్‌లలో ఆగని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లకు మంచిర్యాలలో హాల్టింగ్ ఉండడం వల్ల రద్దీ ది నదినానికి పెరుగుతోంది.

ఉపాధికి కేంద్ర బిందువుగా....

సింగరేణి, సిరామిక్స్, రైస్‌మిల్లులు, ఎస్‌టీపీపీ, సింగ రేణి థర్మల్‌పవర్ ప్రాజెక్టు(జైపూర్), ఓరియంట్ సిమెంట్ ఇండస్ట్రీలతో పాటు హోటల్స్, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో అనేకమంది ఇతర రాష్ట్రాలనుంచి మంచిర్యాలలో ఉపాధి పొందుతున్నారు. మంచిర్యాల స్టేషన్‌కు ప్రయాణికులతో పాటు అటు ఇండస్ట్రీయల్ ఉపకరణాల దిగుమతి కూడ మిషనరీల దిగుమతికి కూడ గూడ్స్ రైళ్లు ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు కీలకంగా మారాయి. ఒకవైపు అభివృద్ధిపనులు వేగంగా నడుస్తుండగా రెస్ట్‌రూంలు, టాయిలెట్‌లు, డ్రింకింగ్‌వాటర్ సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సీసీకెమెరాలు, స్టేషన్‌లో అన్ని వైపులా ఏర్పాటు చేశారు. స్టేషన్ బయట వాహనాల పార్కింగ్, షాపింగ్ జోన్స్‌కోసం స్థలం కేటాయించారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. దీంతో త్వరలోనే మంచిర్యాల రైల్వే స్టేషన్ విమానాశ్రయాన్ని తలపించే విధంగా మారుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కోరుకుంటున్న మూడో ప్లాట్‌ఫారం అభివృద్ధి పనులు ఊపందుకోవడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంచిర్యాల నుంచి వరంగల్‌వంటి పట్టణాలకు ఉద్యోగులు అనేక మంది రైల్వే పాసులు తీసుకొని రాకపోకలు సాగిస్తుంటారు. సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్‌వరకు వెళ్లే వందేభారత్ సైతం మంచిర్యాలలో త్వరలో హాల్టింగ్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాబోయే 50ఏళ్ల వరకు దృష్టిలో ఉంచుకొని ఆధునీకరణ పనులు చేపడుతున్నారు. స్టేషన్ ఎదుట క్యాబ్‌లు, ఆటోలు, రాపిడోలు కూడ తగిన పార్కింగ్‌లో అందుబాటులోకి రానున్నాయి.

మరిన్ని రైళ్లకు హాల్టింగ్ కోసం కృషి

- పెద్దపల్లి ఎంపీ, వంశీక్రిష్ణ



అమృత్ భారత్ 2.0 పథకం ద్వారా మంచిర్యాల రైల్వే స్టేషన్‌ను మరింత ఆధునీకరించి ఎయిర్‌పోర్ట్‌గా మాదిరి గా అభివృద్ధికి కృషి చేస్తా. సంవత్సర కాలంగా పలు రైళ్లను నిలుపుదల చేసిన ఫలితం విజయవంతమైంది. నా గ్ఫూర్ టు కాసిపేట ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరిం చాను. పలు సూపర్‌ఫాస్ట్ రైళ్లను మంచిర్యాలలో నిలిపివేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చా. రానున్న కాలం లో శక్తివంచనలేకుండా కృషి చేసి మంచిర్యాల రైల్వేస్టేష న్‌ను దేశంలోనే ఉత్తమ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించాం. కేంద్ర రైల్వే మంత్రిని పలు మార్లు కలిసి జిల్లాలోని మిగితా రైల్వే స్టేషన్ కోసం నిధులు కేటాయించాలని నివేదికలు సమర్పించాను. త్వరలోనే సంకల్పం నెరవేరబోతుంది. ప్రయాణికులకు అధు నాతన సౌకర్యాలు అందుబాటులో వస్తాయి.

మెస్ నిర్వహణ మహిళలకు అందేనా..?

(5వ పేజీ తరువాయి)

అందించాల్సి ఉండగా ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.80 కేటాయించింది. కనీసం ఐదు శాతం మేరకు మైనస్ టెండర్లు వేయాలని సూచించారు. మే 23వ తేదీ టెండర్ దాఖలు చేయడానికి చివరి తేదీ వరకు నిర్ణయిం చారు. మరునాడు టెండర్లను తెరిచారు. టెండర్లలో పాల్గొన్న వారందరూ రూ.72కే భోజనం అందించేందుకు దాఖలు చేశారు. దీంతో అత్యధిక టర్నోవర్ ఉన్న కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి గత నెల 28న ఆర్డర్ ఇచ్చారు. అయితే మెస్‌లను మహిళా గ్రూపులకు ఇవ్వాలని 27వ తేదీనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులు వెలువడిన మరునాడు కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి అవార్డు చేయడం కొసమెరుపు. పక్కనే ఉన్న రామగుండం ప్రభుత్వ ఆసుపత్రి మెస్‌కు సంబంధించిన టెండర్లు మే30న తెరువాల్సి ఉండగా ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరిస్తూ అక్కడ అధికారులు టెండర్లను రద్దు చేశారు.

ప్రభుత్వ ఆదేశాలు అమలయ్యేనా...?

మహిళా సంఘాలకే మెస్ చార్జీలు అప్పగించాలనే ప్రభుత్వ ఆదేశాలు మంచిర్యాలలో కానరావడం లేదు. ఇప్పటికే కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి అవార్డు అందజేయడమే దీనికి కారణంగా నిలుస్తోంది. అయితే పాత టెండర్లు ముగిసి కొత్త కాంట్రాక్టుకు బాధ్యతలు అప్పగించడం, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ ఇంకా తమ విధులను ప్రారంభిం చకపోవడంతో టెండర్లను రద్దు చేసి మహిళా సంఘాలకు అప్పగించాలనే డిమాండ్లు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిచంద్ర రెడ్డిని వివరణ కోరగా నిబంధనల మేరకే టెండర్లు ఓపెన్ చేసి కాంట్రాక్టింగ్ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందితే సంబంధిత కాంట్రాక్టును రద్దు చేసి మహిళా సం ఘాలకు అప్పగించే వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

సొంతింటి కల సాకారం చేస్తున్న ప్రభుత్వం



తాండూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వినోద్

తాండూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని పెగడపల్లి గ్రామంలో 20 మంది లబ్దిదారులకు నూతన ఇందిరమ్మ ఇంటి పత్రాలను అందజేశారు. అనంతరం నూతన ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శ్రీనివాస్, హౌజింగ్ ఏఈ కావ్య, ఎంపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భూభారతి సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని పెగడపల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వినోద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వ్యవసాయాధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేధం

రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, జూన్3 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం నిషేదాజ్ఞలు కొనసాగించడంతో పాటు అనుమతి లేని డ్రోన్, డీజే సౌండ్స్‌పై చర్యలు తీసుకుంటామని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు రావడంతో చర్యలు తీసుకున్నామని తెలిపారు. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. వివాహక వే డుకల్లో ఇతర కార్యక్రమాల్లో అనుమతిలేని డీజేలపై చర్యలు తీసుకుంటామని సూచించారు. రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సీటీ పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే పథకాల అమలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు సదానందం

మందమర్రి టౌన్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం, ప్రగతిలో ప్రజా ప్రభుత్వం అగ్రభాగంలో ఉందని మంచిర్యాల యాదవ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు బండి సదానందం తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలు తెలంగాణాలో అమలవుతున్నాయని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముందు చూపుతో సన్న బియ్యం పథకంతో పాటు ఇందిరమ్మ గృహాలు, రాజీవ్ యువ వికాసం అమలు చేసిన ఏకైక నాయకుడు అని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభివృద్ధికి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పెద్దపీట వేస్తున్నారన్నారు. రైల్వే ప్రయాణికులకు సంబంధించి పలు రైళ్ల నిలుపుదలకు కృషి చేశాడన్నారు. ఎంపీగా గెలిచి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మందమర్రిలో ఈ నెల 4న విజయోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలాదిగా ప్రజలు, నాయకులు తరలి రావాలని, ఈ సభకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరవుతున్నారని తెలిపారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా



దండేపల్లిలో కళజాత ప్రదర్శిస్తున్న కళాకారులు

దండేపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటి పథకాల అమలు తీరుపై దండేపల్లి ఎస్సీ కాలనీలోని మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆట పాటల ద్వారా కళా ప్రదర్శం ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆరు గ్యారంటి పథకాలను ప్రజల్లోకి అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పని చేస్తోందన్నారు. సీజనల్‌వ్యాధుల పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఆటపాటలతో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ లావుడ్యా రమేష్, కళాకారులు మురళీ, పోషం, శ్రీనివాస్, కిష్టయ్య, సత్యనారాయణ, కృష్ణ. లచ్చన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు



బెజ్జాలలో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ వనజారెడ్డి

జైపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలు తీరుతాయని తహసీల్దార్ వనజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముదిగుంట, బెజ్జాల గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను ఆమె ప్రారంభించారు. ముదిగుంటలో 12, బెజ్జాలలో 26 దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతి, ఎఎస్‌వో సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట: రెవెన్యూ సదస్సులకు మండలంలో మిశ్రమ స్పందన లభిస్తోంది. రెండు బృందాలుగా ఏర్పడి మొదటి రోజు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ భోజన్న హాజరయ్యారు. పెద్దనపల్లిలో భూ సమస్యలపై 13 దరఖాస్తులు రాగా డిప్యూటి తహసీల్దార్ నాగుల అంజయ్య ఆధ్వర్యంలో కొండాపూర్ జీపీలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దీనికి కేవలం ఒక్కదరఖాస్తు మాత్రమే వచ్చింది. తహసీల్దార్ భోజన్న మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. కోర్ట్ కేసుల్లో ఉన్న భూములతో పాటు వివాదాస్పద భూములను మినహాయించి అన్ని భూముల సమస్యలను స్థానికంగానే పరిష్కరిస్తామని కాబట్టి భూ సమస్యలు ఉన్న రైతులందరూ రైతు సదస్సులకు హాజరుకావాలని ఆయన సూచించారు.

కోటపల్లి: భూసమస్యల పరిష్కారానికే భూ భారతి గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రాఘవేంద్రరావు అన్నారు. మంగళవారం మండలంలోని శెట్‌పల్లి, రాపన్‌పల్లి, అర్జునగుట్ట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. భూమి పట్టాలకు సంబంధించి పేర్ల సవరణ, విస్తీర్ణంలో సవరణ, మ్యుటేషన్, వారసత్వ దరఖాస్తులు, ఇంకా ఎటువంటి సమస్యలున్నా గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. శెట్‌పల్లిలో తహసీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో 2 దరఖాస్తులు రాగా రాపన్‌పల్లి, అర్జునగుట్ట గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో 24 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆర్ ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని జక్కెపల్లి, మామడ గ్రామాల్లో మంగళ వారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. జక్కెపల్లిలో 3, మామడలో 7 భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ తెలిపారు.

బెల్లంపల్లి: ఎన్నో ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం భూభారతి రెవెన్యూ స ద స్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ క్రిష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని అంకూసం గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో మాట్లాడారు. మొత్తం రైతుల వద్ద నుంచి వివిధ సమస్యలతో కూడిన 18 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఈ నెల 23 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

దండేపల్లి: భూభారతి చట్టాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దండేపల్లి తహసీల్దార్ రోహత్ దేశపాండే సూచించారు. దండేపల్లి మండలం తానిమడుగు, బిక్కనగూడలో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సమస్యల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తానిమడుగులో 9, బిక్కనగూడలో మూడు దరఖాస్తులు వచ్చాయి. రైతులు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోని మీ భూ సమసమ్యలను పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ విజయ, సీనియర్ అసిస్టెంట్ ముత్తె లావణ్య, ఆర్ఐ బొద్దుల భూమన్న, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జన్నారం: భూభారతిలో వచ్చిన ప్రతి భూ సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలో భూ భారతి గ్రామ సభలు మొట్టమొదటి రోజు మండలంలోని రేండ్ల గూడ, రాంపూర్ గ్రామాల్లో మంగళవారం మొదలయ్యాయి. భూ సమస్యలపై గ్రామాల్లో అడిగి తెలుసుకున్నారు. రేండ్ల గూడలో 87 మంది, రాంపూర్ గ్రామంలో 40 మంది భూ సమస్యల పై దరఖాస్తు చేసుకున్నారు. నాయకులు ఎఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, అల్లం రవి అధికారులు , ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నెన్నెల : కొత్త రెవెన్యూ చట్టం భూభారతి అమలులో భాగంగా మంగళవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి.

మొదటి రోజు పొట్యాల, ఆవడం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. పొట్యాలలో 33, ఆవడంలో 115 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ మహేంద్రనాథ్ తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఎంఆర్ఐ సులోచన పాల్గొన్నారు.

రాజిరెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

చెన్నూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డిని విమర్శించే స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులకు లేదని చెన్నూరు మున్సి పాలిటీ మాజీ కౌన్సిలర్ పోగుల సతీష్, రాజిరెడ్డి వర్గం కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చెన్నూరు మాజీ జడ్పీటీసీ కరుణాసాగర్‌రావు, కోటపల్లి మాజీ జడ్పీటీసీ రాంరెడ్డిలతో పా టు కొంత మంది కాంగ్రెస్ నాయకులు విలేకరుల సమా వేశంలో మూల రాజిరెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. రాజిరెడ్డి కాంగ్రెస్ పార్టీలో వెన్నుదన్నుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అన్నారు. రాజిరెడ్డిపై ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామికి లేని పోని విషయాలు చెప్పి ఎమ్మెల్యేకు దగ్గర కావడం కోసం ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. రాంరెడ్డి మతి స్థిమితం కోల్పోయి రాజిరెడ్డిపై విమర్శలు చేస్తున్నాడన్నారు. ఇలాంటి విమర్శలు చేస్తే రానున్న రోజుల్లో నియోజకవర్గ ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ముత్యాల రవికుమార్, ఠాగూర్, స్వరూప్ సింగ్, మంథని సమ్మయ్య, స్వామి, చెన్నూరు, భీమారం, కోటపల్లి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్3 (ఆంధ్రజ్యోతి): రానున్న వానాకాలం పంటల సాగులో రైతులకు విత్తన వినియోగంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవ సాయ అధికారి కల్పనతో కలిసి మండల వ్యవసాయ అధికారులు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసం హారక మందుల డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు, రిటైలర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వానాకాలం పంటల సాగులో విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొనుగోలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సీజన్‌లో పంట సాగుకు అవసరమైన వరి, పత్తి విత్తనాల లభ్యతను పరిశీలించుకొని ఏదైన కొరత ఉంటే ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. వర్షాలు, విత్తనాలు నాటడం, ఎరువుల వినియోగం అంశాలపై రైతులకు అవసరమైన మెలకువలు అందించాలని, నకిలీ లేదా నిషేధిత విత్తనాలు, ఎరువుల వినియోగం కలిగే నష్టాపైపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల విక్రయ సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, అర్హత గల రైతులకు మాత్రమే విక్రయించాలని తెలిపారు. ఇప్పటి వరకు దాదాపుగా పత్తి విత్తనాలు అందించామని, సరిపడా నిల్వాలు ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నెన్నెల : అంతర్జాతీయ యోగ దశాబ్ధి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో యోగా వాక్ నిర్వహించారు. బ్యానర్లు, ప్లకార్డులతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా వాక్ కొనసాగింది. శిక్షకులు మమత, ప్రదీప్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సాగులో విత్తన ఎంపిక కీలకమని జగిత్యాల శాస్త్రవేత్త మధుకర్ పేర్కొన్నారు. మంగళవారం సండ్రోన్‌పల్లిలోని రైతు వేదికలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవో ముత్యం తిరుపతి, గందె రాంచందర్, నీలయ్యహన్మంతు, జనార్ధన్, అంజయ్య, రాజన్న, రాజలింగు పాల్గొన్నారు.

మందమర్రి టౌన్ : పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని మంచిర్యాలలోని తన నివాసంలో కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు బండి సదానందం, రాంచందర్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : 2025-26 విద్యా సంవత్సరానికి గాను శ్రీరాంపూర్ ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు.

నెన్నెల : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం మంజూరు పత్రాలు అందజేశారు. పలు గ్రామాల లబ్ధిదారులకు ప్రొసిడింగ్ పేపర్లు ఇచ్చారు. అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దండేపల్లి(లక్సెట్టిపేట): లక్సెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి గోర్ల లింగన్న అనే రైతు కుటుంబానికి రూ. 2 లక్షల ప్రమాద భీమా చెక్కును పీఏసీఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, వైస్ చైర్మన్ కాసు సురేష్‌లు పంపిణీ చేశారు.

నస్పూర్ : అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా నస్పూర్ ఆయుష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం యోగా వాక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణ నుంచి నస్పూర్ వరకు యోగా వాకింగ్ ర్యాలీ చేశారు. ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి పద్మజ, యోగ శిక్షకులు సుధాకర్, మేఘన, సిబ్బంది కిషన్ పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని తపాల్‌పూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పీసీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 50కిలోల బియ్యాన్ని అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు వ్యవస్థాపక అధ్యక్షులు ముడుగు ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఆయన వెంట ఫౌండేషన్ సభ్యులు రాగుల శంకర్, కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంచిర్యాలకలెక్టరేట్: జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధిశాఖ అధికారిగా షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈడీ చాత రాజుల దుర్గాప్రసాద్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

- జిల్లా వ్యాప్తంగా 458 దుకాణాలు
- అధిక ధరలకు విక్రయించొద్దని హెచ్చరిక
- తరుచూ తనిఖీలు చేపడుతున్న ఉన్నతాధికారులు





ఎరువుల దుకాణంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే(ఫైల్)

ఎరువులు, విత్తన విక్రయాలపై నిఘా

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో పంటల సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చూసేందుకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను అందుబాటులో తెచ్చేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ ఆదేశాలిచ్చింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆధ్వర్యంలో వ్యవ సాయ, రెవెన్యూ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు సొసైటీల ద్వారా రైతులకు మేలు జరిగేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. వారం రోజుల క్రితం జిల్లాలోని పలు ఎరువులు, పురుగు మం దులు, విత్తనాల దుకాణాల్లో కలెక్టర్ స్వయంగా తనిఖీలు చేపట్టారు. ఆయా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రాలు, విత్తన ప్యాకెట్లు తదితర విషయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, నిబంధనలు పాటించేలా చూడాలని జిల్లా వ్యవసా యాధికారి శ్రీనివాస్‌రావును ఆదేశించారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా 458 ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు ఉన్నాయి. మొత్తంగా 4.45 లక్షల ఎకరాల్లో పంటలు సాగుకు ప్రణాళికలు సిద్ధం చేస్తారని అంచనా వేస్తున్నట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. అన్ని షాపుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పత్తి, వరి, కంది, కూరగాయలు తదితర విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా చూడాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలతో మోసపోకుండా ఉండే విధంగా, అలాగే ఆయా దుకాణాల్లో బిల్లులు సరిగ్గా ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. కాగా జిల్లాలో ఈ ఏడాది 3.35 లక్షల ఎకరాల్లో పత్తి, 56వేల ఎకరాల్లో వరి, 30 వేల ఎకరాల్లో కంది, మరో 22వేల ఎకరాల్లో కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలు వేసేందుకు అంచనాలున్నాయి. ఆయా రైతులకు ప్రతీ సారి లాగే పీఏసీఎస్, ఏఎస్ఆర్కే, గ్రోమోర్, డీసీఎంఎస్‌లతో పాటు అన్ని సొసైటీల ద్వారా అన్ని రకాల ఎరువులు, ఇతర కాంప్లెక్స్ ఎరువులు, తదితర వస్తువులు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా ముఖ్యంగా పండించే పత్తి పంటకు రైతులకు అందించే విత్తన ప్యాకెట్లు 1.44 లక్షల ప్యాకెట్లు అదనంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. కెరమెరి ప్యాక్స్ (పీఏసీఎస్)కు బి.జి ఆమోదం లభించగా త్వరలోనే మరిన్ని సొసైటీల ద్వారా అన్ని రకాల వ్యవసాయ వస్తువులు అందనున్నాయి. ఎలాంటి అవకత వకలు జరకకూడదని సొసైటీల ద్వారానే ఈ సారి ఎరువుల పంపిణీకి ప్రభుత్వ నిర్ణయించింది.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. వానాకాలానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు విక్రయాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ, టాస్క్‌ఫోర్స్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిఘా పటిష్టం చేసింది. నకిలీ పత్తి విత్తనాలు అమ్మకుండా దాడులు చేస్తున్నారు. అలాగే ఎమ్మార్పీకే ఎరువులు, పురుగుల మందులు, విక్రయించాలని అధిక ధరలకు అమ్మకాలు జరిపితే షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరిస్తున్నారు. ఆయా శాఖల అధికారులు యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు పురుగు మందులు కొనుగోలు చేయాలని, రశీదులు పొందాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా జిల్లాకు పత్తి విత్తనాల ప్యాకెట్లు 6.70 లక్షలు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. యూరియా 60,000 మెట్రిక్‌ట న్నులకు గానూ 8వేల మెట్రిక్‌టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నది. డీఏపీ 40,000 మెట్రిక్‌టన్నులకు గానూ 28వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నది. ఎంవోపీ 10,000 మెట్రిక్‌టన్నులకు 204 బస్తాలు, సూపర్ ఫాస్ఫేట్ 18,000 మెట్రిక్ టన్నులకు గానూ 900బస్తాలు, కాంప్లెక్స్ ఎరువులు 20,000 మెట్రిక్ ట న్నులకు 2,700 బస్తాలు ఉన్నట్లు చెబుతున్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. లింగాపూర్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన రాథోడ్ గణేశ్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన సతీమణి, కూతురికి కో ఆపరేటీవ్ సొసైటీ ద్వారా అందించాల్సిన రూ.1.65 లక్షల చెక్కును మంగళవారం ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెడ్ కానిస్టేబుల్ కుటుంబ సభ్యుల స్థితిగతులను అడిగి తెలుసుకన్నారు. వారి కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అందించాల్సిన ఇతర బెనిఫిట్‌లను అందజేసే విధంగా చూస్తామని భరోసా ఇచ్చారు. పోలీసు శాఖలోని సిబ్బంది అందరు పోలీసు కోపరేటీవ్ సొసైటీలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కో ఆపరేటీవ్ కో ఆర్డినేటర్ జాఫరుద్దీన్, ఆర్ఐలు పెద్దయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే ప్రాధాన్యం

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకే పోలీస్‌శాఖ ప్రాధాన్యమిస్తోందని, సమస్యలపై నిర్భయంగా పోలీసుస్టేషన్‌ను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివా సరావు అన్నారు. షీటీం ద్వారా జిల్లాలో చేపడుతున్న అవగాహన సదస్సుల నిర్వహణపై మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలు, చిన్నపిల్లల రక్షణే పోలీసు శాఖ తొలి ప్రాధాన్యం అన్నారు. జిల్లా వ్యాప్తంగా షీ టీం ద్వారా ఫిర్యాదుల స్వీకరించినట్లు తెలిపారు. మహిళలు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, హింసకు గురైనట్లయితే జిల్లాలో షీ టీంలను సంప్రదించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రెండు షీ టీంలు పని చేస్తున్నాయని చెప్పారు. సమస్యలు ఉంటే ఆసిఫాబాద్ (8712670564), కాగజ్‌నగర్ (8712670565), లేదా డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టొద్దు

కాగజ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టొద్దని మున్సిపల్ కమిషనర్ అంజయ్య అన్నారు. కాగజ్‌నగర్ ఎల్లాగౌడ్ తోటలోని మురికి కాల్వను మున్సిపల్ కమిషనర్ అంజయ్య మంగళవారం పరిశీలించారు. వర్షాకాలంలో వరదతో వచ్చే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మురికి కాల్వలను శుభ్రం చేసేందుకు సిబ్బందికి సూచించారు. అలాగే కాల్వ సమీపంలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. బఫర్ జోన్‌లో ఇంటి నిర్మాణం చేపడితే కూల్చివేస్తామని తెలిపారు. ఆయన వెంట టీపీవో యశ్వంత్ సిబ్బంది ఉన్నారు.

టైగర్‌జోన్ ప్రతిపాదన విరమించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివాసీల భూములను లాక్కొనే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెరమీదకు తీసుకు వచ్చిన కాగజ్‌నగర్ టైగర్ జోన్ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఆదిమ గిరిజన భూ రక్షణ పోరాట కమిటీ, రాజ్‌గోండ్ సేవా సమితి, గోండ్వానా పంచాయతీ రాయిసెంటర్ ఆధ్వర్యంలో 6వ రోజు శాంతియుత నిరసన దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టైగర్ జోన్ పేరుతో భూములు తిరిగి తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టైగర్ జోన్ అయితే ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీన్ని ఆదివాసీలంతా కలిసి కుమరం భీం పోరాట స్ఫూర్తితో వ్యతిరేకించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులపై అటవీశాఖ అధికారులు అక్రమ కేసులు పెట్టి దౌర్జన్యాలు చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారులు తొత్తులుగా పని చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని అన్నారు. ఆదివాసీల హక్కుల కోసం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో వారి హక్కులు సాధించిన కుమ రం భీంను ఆదర్శంగా తీసుకుని పోరాడుతామని చెప్పారు. ఆదివాసీ గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం అటవీ శాఖాధి కారులు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల కోసం తాను ఎప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అర్జు, పోచయ్య, సుధాకర్, రవీందర్, పాల్గొన్నారు.


దరఖాస్తుల ఆహ్వానం

లింగాపూర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ విద్యార్థులకు బోధించేందుకు అధ్యాపకులు దరఖాస్తులు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి ప్రసన్నభారతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మహిళా అభ్యర్థులు 8వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఇంగ్లీషు(1), ఎకనామిక్స్(1), తెలుగు(1) , కామర్స్(1) పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలని ప్రత్యేకాధికారి సూచించారు.

బురదగూడలో క్రికెట్ పోటీలు ప్రారంభం

కాగజ్‌నగర్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ గ్రామ పంచాయతీ లెవల్ క్రికెట్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. కొత్తపల్లి చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా నాయ కుడు డాక్టర్ శ్రీనివాస్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మేడి కార్తీక్, గుమ్ముల సాయి, రాజు, జగన్, గ్రామస్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



అవగాహన కల్పిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు కోరారు. మండలంలోని ఇప్పల్‌నవేగాం, తెనుగుగూడ గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న పనులపై ఎంఈవో సుభాష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు ఊశన్న, ఇందురావు, హేమంత్ షిండె, రమేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



వాంకిడిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

వాంకిడి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదు ర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరిం చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్విని యోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. మండలంలోని ఘాట్‌జనగాం, జైత్‌పూర్ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. భూములకు సం బంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, నాయబ్ తహసీల్దర్ రాంలాల్, గిరిధర్, మాజీద్ పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ సూర్యప్రకాష్ అన్నారు. నారాయణపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): రైతుల భూమి సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. మండలం లోని అంబగట్టు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అచ్యుత్‌రావు, నాయకులు తదితరులు ఉన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): రైతుల భూమి సమస్యలు పరిష్కరించేందుకు భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ భూమేశ్వర్ అన్నారు. జోడేఘాట్, కేలి(బి) గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులకు సంబంధించి భూముల సమస్యలు పరిష్కరిం చేందుకు గ్రామాలకు రెవెన్యూ అధికారులు వచ్చి రైతు సమస్యలు తెలుసుకని దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దాదర్ సంతోష్ కుమార్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహీసల్దార్ మునావర్ షరీఫ్ అన్నారు. బీబ్రా, దహెగాం గ్రామాల్లో సదస్సులను ప్రారంభించారు. క్యాక్రమంలో ఎంఆర్ఐ నాగభూషణం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సమస్యలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రహీముద్దీన్ అన్నారు. మండలంలోని అచ్చెల్లి, చింతకుంట, కేశవపట్నం, భూపాలపట్నం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండంలంలోని శివనూర్, దుబ్బగూడ తదితర గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆడ బీర్షావ్ మాట్లాడుతూ పోడు భూములకు విరాసత్, కొత్త పట్టాలకు రైతులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు సందీప్, మడావి భీంరావ్, ఆర్ఐ ఎల్ మోహన్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నాగరాజు గౌడ్ అన్నారు. మండలంలోని ఘూంనూర్, కంచన్‌పల్లి, చోర్‌పల్లి, గ్రామపంచాయతీలలో సిబ్బంది రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

కౌటాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మిగిలి ఉన్న ఒకేషనల్ కాంట్రాక్టు అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళా శాల ఆవరణలో అధ్యాపకులు నల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి సేవలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్లు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ప్రత్యేక కౌంటర్

కాగజ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఎస్‌బీఐ బ్యాంకులో పెన్షనర్లు, సీనియర్ సిటిజన్ల కోసం మంగళవారం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. రెండ్రోజుల క్రితం బ్రాంచ్ మేనేజర్ సతీష్‌గౌడ్‌కు విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈమేరకు మంగళవారం నుంచి కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ్, శివప్రసాద్, సభ్యులు షేక్ మహబూబ్, ఎం.సుభాష్, సునీల్ కుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.



పెన్షనర్లు, సీనియర్ సిటిజన్ల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బెజ్జూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలోని బారేగూడ గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. బారేగూడ-ముంజంపల్లి గ్రామాల మధ్య వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి(60) మృతదేహం కనిపించడంతో వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆదివారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవో

కెరమెరి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాల యంలో మంగళవారం ఉపాధ్యాయులు ఎంఈవో ప్రకాష్ పాఠ్యపుస్తకలను పంపిణీ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభం రోజున విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందజేయాలని ఆయన సూచించారు.

పెద్దవాగు సమీపంలో ఒకరి హత్య

కాగజ్‌నగర్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో మంగళవారం పట్టణానికి చెందిన దావుద్(18)ను గుర్తు తెలియని వ్యక్తులు బండలతో తలపై బాది హత్య చేశారు. సంఘటన స్థలానికి డీఎస్పీ రామానుజం, సీఐ శ్రీనివాస్, ఎస్సై సందీప్ చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనంతో దిగుబడి

ఆసిఫాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన నాణ్యమైన వరి, కంది, పెసర విత్తనాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శివకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు మంజుల, విజయ్, దీప్తి, ఏఈఓలు చిరంజీవి, రహెమాన్, స్వాతి, ధమ్మదాస్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి సాధించుకో వచ్చని జగిత్యాల జిల్లా పొలాస పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సతీష్, డాక్టర్ రత్నాకర్ సూచించారు. రైతు వేదికలో విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణ, శంకర్, రాజేశ్వర్, మానస, అరవింద్, పరిమిళ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనం పంట దిగుబడి సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త తిరుపతి అన్నారు. మండలంలోని అన్ని రైతు వేదికల్లో ఏవో రామకృష్ణతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవోలు రైతులు పాల్గొన్నారు.

తిర్యాణి, (ఆంధ్రజ్యోతి): రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అనీల్‌గౌడ్ అన్నారు. చింతపల్లి రైతు వేదికలో వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో ఉచితంగా కంది, పెసర, రవి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బలరాం, ఏవో వినయ్, నాయకులు శ్రీనివాస్, ఏఈవోలు వినోద్‌కుమార్, ముత్తయ్య, సాగర్ పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో పంటల దిగుబడి సాధించవ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ తిరుపతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నాణ్యమైన విత్తనం- రైతు నేస్తం పథకంలో భాగంగా వరి, కంది, పెసర నాణ్యమైన విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు మారుతి, శ్రీధర్, మీన, నాయకులు శంకర్, శ్రీనివాస్, శంకరయ్య, పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): రైతులు విత్తన స్వయం సమృద్ధి సాధించాలని ఏవో కార్తేషా అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం కార్యక్రమంలో భాగంగా రైతులకు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు వెంకటేష్, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): కృషి విజ్ఞాన కేంద్రం బెల్లంపల్లి శాఖ ఆధ్వర్యంలో రైతులకు మేలు రకమైన విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగిల్ విండో చైర్మన్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ రైతులకు మేలు రకమైన విత్తనాలను అందించాలన్న ఉద్దేశ్యంతో కృషి విజ్ఞాన కేంద్రం పలు పరిశోధనలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్‌చైర్మన్ రంగు మహేష్, ఎల్ రమేష్, ఏఈవో దిలిప్ కుమార్, ఏఈవోలు రాకేష్, సంజీవ్, సుకన్య, శివ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో విత్తనాలను పంపిణీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు